
ప్రజాశక్తి

ఆదివారం 30 మార్చి 2025 8 పేజీలు



తిరుపతి



చిత్తూరు

కార్పొరేషన్ వార్షిక బడ్జెట్ రూ.611 కోట్లు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.611 కోట్లతో బడ్జెట్‌ను ఆమోదించారు. తుడ కార్యాలయంలో శనివారం తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ మొదటి బోర్డు సమావేశం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య, ఎంఎఅండ్ యుడి ఒఎస్‌డి వెంకట సుబ్బయ్య, ఆర్‌డి శ్రీనివాసులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కేటాయింపుల్లో నియమ నిబంధనలు పాటించాలన్నారు. తిరుపతి పట్టణాభివద్ధి సంస్థ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ 2025-2026 వార్షిక బడ్జెట్ లో 611 కోట్లకు ఆమోదం తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ఖాతా నివేదికలను ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్, ఆంధ్రప్రదేశ్ వారిచే ఆడిట్ చేయించేయందుకు, రేణిగుంట మండలం, సూరప్పకశం నందు 145 ఎకరములలో పద్మావతి నగర్ లేఔట్ నందు సిసి డ్రెయిన్స్ నిర్మాణానికి, విద్యుద్దీకరణ పనులు చేయుటకు, మహిళా యూనివర్సిటీ నందు విద్యార్థుల సౌకర్యార్థం రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపారు. తుడా టవర్స్ నందు నివాసయోగ్యమైన 2,3,4 బెడ్ రూమ్ ప్లాట్స్ ను ఈ-వేలము ద్వారా విక్రయించారు. అలాగే గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ యందు వాణిజ్య గదులను, 2,3,4 ఫ్లోర్లు నందు కార్యాలయపు గదులను విక్రయం, లీజు కు ఇచ్చుటకు ఆమోదం తెలిపారు. నెల్లూరు-తడ, తడ-శ్రీకాళహస్తి, పుత్తూరు నుండి కడూరు వరకు ఉన్న మూడు ప్రధాన రహదారులకు రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లను, కన్సల్టెన్సీ ద్వారా చేయటానికి, తుడా లో విలీనమైన ప్రాంతాల మాస్టర్ ప్లాన్ తయారీపై టెండర్లను ఆహ్వానించేందుకు, యస్.వి.యూనివర్సిటీ పరిధిలో ఆమోదించిన ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్డులను తొలగించుట కొరకు ప్రభుత్వం వారికి ప్రతిపాదనలు పంపేందుకు ఆమోదం తెలిపారు. రుయా హాస్పిటల్ నందు రోడ్లు అభివద్ధి పరచుటకు ఆమోదం తెలిపారు. తుడా ఉపాధ్యక్షురాలు మౌర్య మాట్లాడుతూ.. తుడా నిధులతో ప్రజలకు ఉపయోగకరమైన పనులు చేపడదామని తెలిపారు. ఈ బోర్డు సమావేశంలో తుడా ఇంచార్జి సెక్రెటరీ కష్ణా రెడ్డి, ఈ.ఈ. రవీంద్ర, పి. ఓ.దేవి కుమారి పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయక 'సాహస' యాత్ర

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, పాకాల

మండు వేసవి.. ఐదు నిమిషాలు ఎండలో నిలబడితేనే కళ్లు తిరిగే పరిస్థితి.. అధికారులు సైతం ఎంతో అవసరమైతే తప్ప ఎండల్లో తిరగొద్దని సూచిస్తున్నారు. అయితే తిరుపతి సీనియర్ కామ్రేడ్లు చల్లా వెంకటయ్య (71), కుప్పస్వామి (58)లు శనివారం ఉదయం తిరుపతి సుందరయ్యనగర్ నుంచి మధురైకి సైకిళ్లలో బయల్దేరారు. ఐదో తేదీ సాయంత్రానికి మధురై చేరుకోనున్నారు. ఈనెల 2 నుంచి 6వ తేదీ వరకూ మధురైలో సిపిఎం 24వ అఖిల భారత మహాసభలు జరగనున్నాయి. వీటిని జయప్రదం చేయాలని మతసామరస్యానికి ప్రతికగా ఉన్న తిరుపతి నుంచి ఈ యాత్రను ప్రారంభించడం విశేషం. ఈ యాత్రను సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి కే వేణుగోపాల్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ జయచంద్ర, డాక్టర్ పి. సాయి లక్ష్మి నగర నాయకులు నరేంద్ర, మల్లికార్జున్, బుజ్జి, ఓ. వెంకటరమణ, రెడ్డప్ప, బిర్లా నాయుడు, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు. సైకిల్ యాత్ర మధ్యాహ్ననికి పాకాల మండలం కోనపురెడ్డిపల్లికి చేరుకుంది. మండల సిపిఎం కార్యదర్శి మధుసూదన్‌రావు, సిఐటియు మండల కార్యదర్శి ప్రసాద్ సైకిల్ యాత్రగా వెళుతున్న చల్లా వెంకటయ్య, కుప్పస్వామికి స్వాగతం పలికి ఆతిథ్యం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హరిప్రకాష్, మునెమ్మ, మురళి, రవి, ద్వారక, జగన్నాథం పాల్గొన్నారు.



పాకాలకు చేరిన సిపిఎం సైకిల్ యాత్ర



'ఉపాధి'లో 300 కోట్ల వేతనాల చెల్లింపే లక్ష్యం

వార్షిక సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో పనిదినాలు కల్పిస్తూనే అభివృద్ధికి శ్రీకారం చుట్టామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో ఉపాధి హామీ వార్షిక నివేదికపై ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. గడిచిన 2024-25లో జిల్లా పరిధిలో భూగర్భ నీటి శాతాన్ని పెంచడానికి చేసిన కార్యక్రమాలు సత్ఫలితాలను ఇచ్చాయన్నారు. ఈ ఏడాది జిల్లా పరిధిలో 24 శాతం అధిక వర్షపాతం నమోదయ్యింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 4853 చెరువులలో పూడికతీత కార్యక్రమం ద్వారా 124 కోట్ల రూపాయలు ఉపాధి కూలీలకు చెల్లించామన్నారు. ఎస్సీ, ఎస్టీ చిన్న సన్నకారు రైతుల పొలాలలో 6 కోట్ల రూపాయలతో 1064 పంట కుంటలను ఏర్పాటు చేశామన్నారు. 46 కోట్లతో 1920 కిలోమీటర్ల మేర ఫీడరు కాలువలు, పంట కాలువలలో పూడికతీత ద్వారా కూలీలకు వేతనాల చెల్లింపు చేశామన్నారు. 48 కోట్లతో 803 ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో కందకాలు తవ్వడం, 827 ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో 1211 ఎకరాల పండ్ల తోటల సాగు (మామిడి, కొబ్బరి, జామ, సపోట, నిమ్మ, మునగ, రోజా, మల్లిపూలు) పెంపకాల కోసం రూ.2.60 కోట్లు, రూ.71.42 లక్షలు మెటీరియల్ రూపంలో రైతులకు అందించామన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆదేశం ప్రకారం హార్టికల్చర్ ను భాగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇప్పటి వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో పాడి రైతులకు 1500 పశువుల షెడ్లు నిర్మించామని, 2025-26 గాను 3000 షెడ్లు నిర్మించాలని లక్ష్యంగా ఎంచుకున్నామన్నారు. గడిచిన నాలుగు కాలంలో రూ.100 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వసతులు కల్పించామన్నారు. పల్లె పండుగ ద్వారా జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజలకు, రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలను ప్రణాళికా బద్ధంగా చేశామన్నారు.

రూ.300 కోట్ల వేతనాల చెల్లింపే లక్ష్యంగా....

తిరుపతి జిల్లా పరిధిలో రానున్న 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 1.75 లక్షల కుటుంబాలకు పనులు కల్పించడంతో రూ.300 కోట్ల రూపాయలు వేతనాల రూపంలో ఉపాధి కూలీలకు చెల్లించేలా లక్ష్యం నిర్దేశించుకున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచ ప్రాధాన్యతలతో రాబోయే మూడు మాసాలకు సంబంధించి రూ.4.96 కోట్లతో 1600 పైగా పశువులకు నీటి తొట్టెల నిర్మాణం, రూ.30 కోట్లతో 3500 సేద్యపు నీటి కుంటల నిర్మాణం, పంట కాలువల పునరుద్ధరణ, చెరువులు, కుంటలు అభివృద్ధి చేయడం, దినసరి వేతనంగా ఉపాధి కూలీకి 4 నుంచి 5 గంటల పని సమయానికి గాను రూ.307 ను అందించనున్నామన్నారు. కాలువల నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు లక్ష దాటి కేటాయింపులపై టెక్నికల్ సమస్యతో గతంలో ఆగిపోయాయని ప్రజాశక్తి ప్రశ్నించింది. దీనిపై కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందిస్తూ గతంలో టెక్నికల్ సమస్యతో నిధులు కేటాయింపు ఆగిపోవడం వాస్తవమేనని, అయితే ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు నాయుడు దీనిపై చర్చించారని, ఈ సారి నిధుల విడుదలకు ఇబ్బందులు లేకుండా కేంద్రం నుండి అనుమతి ఇవ్వనున్నారని చెప్పారు.

'చెత్త' నిర్వహణ బాధ్యత వారిదే : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

నగరంలో ఎక్కువ చెత్త ఉత్పత్తి చేసే అపార్ట్మెంట్స్, వాణిజ్య సముదాయాల (బల్క్ జనరేటర్స్) వారు సొంతంగా చెత్త నిర్వహణ చేసుకునేలా అవగాహన కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో హెల్త్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, అధికారులతో కలసి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఎవరైతే 100 కేజీల కంటే ఎక్కువ చెత్తని ఉత్పత్తి చేస్తున్నారో వారంతా తడిచెత్తను వాళ్ళ పరిధిలోనే కంపోస్ట్ ఎరువుగా మార్చుకునేలా చూడాలని అన్నారు. వినాయక సాగర్ లో స్విమ్మింగ్ పూల్ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అన్నారు. బైరాగిపట్టెడ లోని రామానాయుడు స్కూల్ లో చెత్తను కంపోస్టు ఎరువుగా తయారు చేయటాన్ని పరిశీలించారు. స్కూల్ గోడలకు పెయింటింగ్ చేయించాలని అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి , హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు.

'వడదెబ్బ'పై అవగాహన

ప్రజాశక్తి -రేణిగుంట

రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రము ఆధ్వర్యంలో రేణిగుంట వారపు సంతలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రము సిబ్బంది వడదెబ్బ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ ఈ వేసవి లో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందువలన వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండ కి తిరగ కుండా ఇంటి పట్టునే ఉండాలని అన్నారు. ఏమైనా పనులుంటే ఉదయం 10 నుండి 11 గంటల లోపే చూసుకోవాలని, బయటికి వెళ్ళాల్సి వస్తే గొడుగు, టోపీ, తలపాగా వంటివి తలకు రక్షణ గా ధరించాలని తెలిపారు. మంచి నీళ్ళు, ఉప్పు కలిపిన మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి అధికంగా తీసుకోవాలని తెలిపారు. అలాగే మాంసాహారం తగ్గించి శాఖాహారం అధికం గా తీసుకోవాలన్నారు. పుచ్చకాయలు, దోస కాయలు వంటి శరీరానికి చలువ చేసే పండ్లు తో బాటు పండ్ల రసాలు తీసుకుంటే మంచిదన్నారు. పలుచటి కాటన్ దుస్తులు ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో కిరణ్ కుమార్ డిప్యూటీ డెమో, రామాంజనేయ రెడ్డి ఎమ్పి హెచ్ యిఒ(ఎపిడెమిక్ సెల్), కామ రాజు హెల్త్ సూపర్ వైజర్ పాల్గొన్నారు.

నేడు కచ్చపిలో ఉగాది వేడుకలు

తిరుపతి టౌన్: మార్చి 30వ తేదీన ఆదివారం నూతన తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకొని కచ్చపి ఆడిటోరియం నందు ఉగాది మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఆదివారం కచ్చపి ఆడిటోరియం నందు శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు ఉదయం 10 గంటల నుండి మ.12 గంటల వరకు జరుగునని తెలిపారు. శనివారం నిర్వహించిన సాంస్కృతిక పోటీలలో గెలిచిన వారికి బహుమతులు ప్రదానం ఉంటాయని తెలిపారు.

టౌన్ బ్యాంక్ అభివృద్ధికి 'కూటమి' అడ్డంకులు : ఛైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు అభివృద్ధిని కూటమి ప్రభుత్వం అడుగడుగునా అడ్డుకుంటోందని, బ్యాంకు అభివృద్ధికి ఏమాత్రం సహకరించడం లేదని, సహకార శాఖ మంత్రికి, రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియాకు తప్పుడు సమాచారం అందించి బ్యాంకు ప్రతిష్టను దిగజారుస్తున్నారని ఛైర్మన్ గీతం జయచంద్రారెడ్డి మండిపడ్డారు. శనివారం సర్వసభ్య సమావేశం బ్యాంక్ ఆవరణలో జరిగింది. ఛైర్మన్ మాట్లాడుతూ వైసిపి హయాంలో బ్యాంక్ అభివృద్ధి జరిగిందన్నారు. టిటిడి బోర్డు మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి రూ.50 కోట్లు డిపాజిట్లు ఇచ్చేందుకు కృషి చేశారన్నారు. మొదటి విడతగా రూ.10 కోట్లు ఇచ్చిందన్నారు. 'కూటమి' అధికారంలోకి రాగానే డిపాజిట్ చేసిన 10 కోట్లను వెనక్కి తీసుకుందన్నారు. బ్యాంకు అభివృద్ధికి కృషి చేయకుండా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. తమ పాలకవర్గం బాధ్యతలు స్వీకరించే సమయంలో రూ.47 కోట్ల మొండి బకాయిలు ఉంటే రూ.33 కోట్లు వసూలు చేశామన్నారు. కూటమి నేతలు డివిడెంట్లు పంపిణీ చేయనీకుండా అడ్డుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో టౌన్ బ్యాంకు వైస్ ఛైర్మన్ ఎస్ యాదవ్, డైరెక్టర్లు కాసిం మహమ్మద్, అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

రేణిగుంట పూర్వ డిటిపై ఎసిబి విచారణ

ప్రజాశక్తి - రేణిగుంట

రేణిగుంట పూర్వ డిటి ప్రేమ్‌కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ శశికళపై ఎసిబి విచారణ జరపాలని శనివారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆధారాలతో సహ కేసు పెట్టినా రేణిగుంట పోలీసులు పట్టించుకోలేదని బాధితులు బుజ్జమ్మ హైకోర్టును ఆశ్రయించారు. రేణిగుంట మండలంలో జగనన్న ఇంటి పట్టాలు ఇప్పిస్తానని దాదాపు రూ.7.20 లక్షలు వసూలు చేసిన డిటీ ప్రేమ్‌కుమార్ నకిలీ పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నది వారి ఆవేదన. బాధితుల ఫిర్యాదు మేరకు డీటీ ప్రేమ్ కుమార్, ఆపరేటర్ శశికలతో పాటు మరో ఇద్దరి పై ఐపీసీ 468, 471, 420 సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన రేణిగుంట పోలీసులు ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసినప్పటికీ రెవెన్యూ అధికారులు పై చర్యలు తీసుకోలేదని హైకోర్టుకు బాధితులు నివేదించారు. ఈ నేపథ్యంలో ఎసిబి అధికారుల ద్వారా విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.



'అమర'లో అత్యాధునిక రక్తనిధి కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - రేణిగుంట

అమర హాస్పిటల్లో రక్త కేంద్రం సెంట్రల్ లేబరేటరీ స్టెమ్ సెల్, మాలిక్యులర్ రీసెర్చ్ సెంటర్ ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి టీటీడీ బోర్డు డైరెక్టర్ భాను ప్రకాష్ రెడ్డి , అమర హాస్పిటల్ డాక్టర్ ప్రసాద్ గౌరినేని ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గౌరినేని ప్రారంభించారు. ఈ రక్త నిధిలో రక్త సేకరణ, పరీక్ష, ప్రాసెసింగ్ నిల్వ కోసం ఆధునిక సాంకేతికత సౌకర్యాలు ఉన్నాయి. రక్తదాతలు గణనీయమైన సంఖ్యలో ముందుకు రావాలని కోరారు.

రేపటి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' రద్దు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్లో రెవెన్యూ డివిజన్, మండల కేంద్రాలలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం ఈ నెల తేదీ 31 న సోమవారం రంజాన్ పండుగ ప్రభుత్వ సెలవు కారణంగా రద్దు చేశామని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించి అర్జీలతో సోమవారం రావద్దని పేర్కొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును అడ్డుకోవాలని ఎంఎల్ఎకు వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లును అడ్డుకోవాలని ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులును మతపెద్దలు కలిసి విన్నవించారు. ఈ సవరణ బిల్లు వల్ల నష్టాలను వివరించారు. ఎంఎల్ఎ స్పందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. తిరుపతి ముస్లిం మత పెద్దలు షేక్ మహబూబ్ బాషా, ఏటీకే మాలిక్, సయ్యద్, నిజాముద్దీన్, అబ్దుల్లాభాయ్, అమీర్ ఖాన్ తదితరులు ఎమ్మెల్యే ను కలిశారు.

సెలవుల్లోనూ రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సెలవుల్లోనూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని జిల్లా రిజిస్ట్రార్ జి.శ్రీరామ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ పండుగలు ఉన్నా, రిజిస్ట్రేషన్లు జరుగుతాయని చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ కార్యాలయాలు పనిచేస్తాయని, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. పండగ రోజుల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్లాట్ బుక్‌చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

మూడు నెలల పాటు సిఫార్సు లేఖలు రద్దు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి శరవేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. వేసవిలో భక్తుల నుంచి విమర్శలు రాకుండా జాగ్రత్త పడుతోంది. ఏప్రిల్ 1 నుంచి మూడు నెలల పాటు సిఫార్సు లేఖలకు దర్శనాలు ఉండవని స్పష్టం చేసింది. ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, ఎంపిలు, ఇతర విఐపిలు కుటుంబ సమేతంగా వస్తేనే విఐపి దర్శనం కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో ఛైర్మన్ బిఆర్ నాయుడు వివరించి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

శ్రీసిటీ-శ్రీవాణి ఉగాది పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం



శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక 'శ్రీవాణి' ఆధ్వర్యంలో వివిధ రంగాలలో విశిష్ట ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. శనివారం శ్రీసిటీ బిజినెస్ సెంటర్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పురస్కారాలను అందజేసి, వారి ప్రతిభా పాటవాలను అభినందించారు. పురస్కార గ్రహీతలలో ఒకరైన ప్రఖ్యాత అవధాన కవి డాక్టర్ నరాల రామారెడ్డి (ప్రొద్దుటూరు), చరిత్రకారుడు డాక్టర్ ఈమని శివ నాగిరెడ్డి, తెలుగు సినిమా వికాసానికి విశేష కృషి చేసిన చలనచిత్ర చరిత్రకారుడు ఎస్.వి. రామారావు, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సంగీత శాఖాధ్యక్షురాలు డాక్టర్ రాణి నాగశ్రీ శైలేశ్వరి, ప్రాస మణిగా పేరుగాంచిన అన్నదాత సుబ్రమణ్యేశ్వర రావు పురస్కారాలను అందుకున్నారు. అవార్డు గ్రహీతలను శ్రీసిటీ ఎండి డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు.

శ్రీసిటీ పరిశ్రమలకు మెరుగైన విద్యుత్ సరఫరా

ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపిఎస్పీడీసీఎల్) తిరుపతి చీఫ్ ఇంజనీర్ జానకిరాం శనివారం శ్రీసిటీని సందర్శించారు. విద్యుత్ సరఫరా అంతరాయాన్ని అరికట్టి, మెరుగైన సరఫరా అందించాలన్న శ్రీసిటీలోని జపాన్ పరిశ్రమల అసోసియేషన్ ఏపీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ కు చేసిన అభ్యర్థన మేరకు సిఈ విచ్చేశారు. శ్రీసిటీలోని కొన్ని పరిశ్రమలలో విద్యుత్ సరఫరా, ఇతర సమస్యలను పరిశీలించారు. విద్యుత్ అధికారులతో సమావేశమై, అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు.

ఎస్వీయూ విశ్రాంతి ఆచార్యునికి కళావతి రత్న అవార్డు



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం పురావస్తు శాఖ విభాగం విశ్రాంత ఆచార్యులు, ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల పూర్వపు అధ్యక్షులు ఆచార్య కిరణ్ క్రాంత్ చౌదరి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కళారత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు, ఓ ఆర్ ఐ మాజీ డైరెక్టర్ ఆచార్య వెంకటరమణారెడ్డి, ఆచార్య ఓఆర్ఐ డైరెక్టర్ ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

కార్మిక సమస్యలపై పోరాడుతాం: సిఐటియు

ప్రజాశక్తి -కేవిబిపురం: కార్మికుల సమస్యలై పోరాడు దామని సిఐటియు మండల నాయకులు పేర్కొన్నారు. కే వి బి పురం మండలంలో శనివారం సిఐటియు మండల నాయకుల సమావేశం నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపతి జిల్లా కమిటీ సభ్యులు నాగలాపురం నాగరాజు అంగన్‌వాడీల, ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాం డు చేశారు. లేదంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం రాజేశ్వరి, ఆశా వర్కర్లు, సిఐటియు కమిటీ కార్యదర్శి మునెమ్మ, మధ్యాహ్నం భోజనం కార్మికులు రాణమ్మ, రజిని, వెంకటమ్మ రవణమ్మ మునెమ్మ కవిత పాల్గొన్నారు.

నేడు శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం

ప్రజాశక్తి - తిరుమల: శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 30వ తేది తిరుమలలోని శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న నాద నీరాజనం వేదికపై కవి సమ్మేళనం కార్యక్రమం జరగనుంది.ఏడు కొండలపై ఏడు కొండలవాడి సాక్షిగా ఏడుగురు కవులతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. 30వ తేది మధ్యాహ్నం 12 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఇందులో మన సంస్కృతి, సాంప్రదాయాలు, టీటీడీ భక్తులకు చేస్తున్న సేవలపై కవులు పద్యాల రూపంలో వివరిస్తారు.

శ్రీవారి ఆలయంలోఉగాది ఆస్థానం

తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఆస్థానం ఘనంగా జరుగనుంది. ఉదయం 7 నుండి 9 గంటల నడుమ ఈ ఆస్థానాన్ని బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జితసేవలైన కళ్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవాన్ని టీటీడీ రద్దు చేసింది.

ఉగాది సంబరాలు

ప్రజాశక్తి - కుప్పం రూరల్ : ఐ.ఆర్.ఎం కాలేజీలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ ధయానిధి ప్రసంగిస్తూ కొత్త సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ భవిష్యత్తులో అన్ని మతాలకు సంబంధిం చిన పండుగలను నిర్వహించవ్చని, సర్వమానవ సౌభ్రాతృ త్వం తమ అభిమతమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మిదేవి, ఐ డి పి ఎస్ ప్రిన్సిపాల్ అరుళ్ రాజ్ పాల్గొని ప్రసంగిం చారు. కళాశాల అధ్యాపకుల బృందం, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేశారు.

పోక్సో చట్టాలపై అవగాహన అవసరం: జడ్జి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పోక్సో చట్టాలపై 18 ఏళ్ల లోపు వారికి అవగాహన అవసరమని పుత్తూరు ప్రధాన జూనియర్ జడ్జి సి జానకి అన్నారు. శనివారం. పుత్తూరు లోని ఐసిడిఎస్ కార్యాలయంలో మండల న్యాయ సేవ అధికారి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ పిల్లలపై లైంగిక దాడికి పాల్పడితే 10 సంవత్సరాలు వరకు లేదా జీవిత కాలం శిక్ష పడే అవకాశం ఉందన్నారు. లైంగిక దాడుల నేపథ్యంలో కఠినమైన పోక్స్ చట్టం వచ్చిందన్నారు. పని ప్రదేశాలు. లైంగిక నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. పోక్స్ చట్టంలో నిందితుడే ఏ నేరం చేయ లేదని నిరూపించి కోలన్నారు. పోక్సో కేసులను విచారించడానికి న్యాయస్థానం చిత్తూరులో ఉందన్నారు ఈ కార్యక్రమంలో న్యాయవాది మురుగేష్ రెడ్డి, ఇన్‌ఛార్జి సిడిపిఓ పి సంధ్య, అంగన్వాడి సూపర్వైజర్లు గీతాంజలి, కోఆర్డినేటర్లు, బి సంతోష్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి జానకి

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రోడ్డు డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో కారు డ్రైవరు మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన తొట్టంబేడు మండలంలోని పెద్ద కన్నలి వద్ద జాతీయ రహదారి బ్రిడ్జిపై శనివారం చోటు చేసుకుంది. హైదరాబాదుకు చెందిన స్నేహితులు మల్లారెడ్డి, భరత్ కుమార్, బాలిరెడ్డిలు తిరుమలకు కారులో బయలుదేరారు. పెద్దకన్నలి వద్ద డ్రైవర్ శ్రీనివాసులురెడ్డి కునుకు తీయడంతో కారు వేగంగా డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమదంలో శ్రీనివాసులు రెడ్డి(43) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మల్లారెడ్డి, భరత్ కుమార్, బాలిరెడ్డిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాసులు రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశు లు తెలిపారు.

శ్రీ ప్రగతిలో 'ఆంగ్ల భాషా' శిక్షణ ముగింపు వేడుక

ప్రజాశక్తి -కోట : నేటి ఆధునిక యుగంలో ఆంగ్ల భాష ప్రాముఖ్యత తెలుసుకుని గత 6 నెలలుగా శ్రీ ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో మ్యాక్ స్పీడ్ చెన్నై వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హలో ఇంగ్లీష్ ప్రోగ్రామ్ ముగింపు వేడుకలు పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల ఛైర్మన్ పసుపులేటి కిషోర్ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ఆంగ్ల భాష చాలా ముఖ్యమని ప్రపంచంలో అత్యధికమంది వాడుతున్న భాష అని ఆంగ్ల భాష వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా ప్రపంచంలో ఎక్కడైనా సరైన ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చన్నారు. మ్యాక్ స్పీడ్ చెన్నై వారి ఆధ్వర్యంలో హలో ఇంగ్లీష్ అనే ప్రోగ్రామ్ నిర్వహించి స్పోకెన్ ఇంగ్లీష్ కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందిం చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, మ్యాక్ స్పీడ్ ప్రతినిధి సూర్య, జగదీశ్ పాల్గొన్నారు.



సెలవు రోజుల్లోనూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఆదివారం, సోమవారం సెలవు దినాల్లో కూడా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ లు యధావిధిగా కొనసాగుతాయని గూడూరు జిల్లా సబ్ రిజిస్ట్రార్ -1 యాసం కేసరి నంద కిషోర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఆర్థిక సంవత్సరం ముగియనున్న సందర్భంగా ఆదివారం (ఉగాది), సోమవారం (రంజాన్) పర్వ దినాలలో కూడా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లో యధావిధిగా కార్యకలాపాలు జరుగుతాయని పేర్కొన్నారు . ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశకి- కుప్పం రూరల్ :

కుప్పం పట్టణంలోని కెసి ఆసుపత్రి అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి ఎండి డాక్టర్ మంజునాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం పరిసర ప్రాంతాలలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో కె సి ఆసుపత్రి ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పటికే తమ ఆసుపత్రి తరుపున పలు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, ముఖ్యంగా విద్యార్థులకు, ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడానికి నిర్ణయించామని, ఈ సేవలు ఏప్రిల్ రెండవ తేదీ నుండి 17వ తేదీ వరకు 15 రోజులపాటు అందుబాటులో ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ప్రజలకు షుగర్ చెక్ అప్, ఎఫ్ బి ఎస్, పి.బి.ఎస్ రక్త పరీక్షలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.

సోలార్ విద్యుత్ పనుల పరిశీలన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఆఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో సోలార్ విద్యుత్తు వినియోగాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు తెలిపారు. తిరుపతి సర్కిల్ పరిధిలోని నారావారిపల్లెలో పిఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్ ఏర్పాటు పనులను సిఎండి సంతోష రావు శనివారం పరిశీలించారు. నారావారిపల్లెలో ఆర్డిఎస్ఎస్ పథకం కింద విద్యుత్ లైన్ల ఏర్పాటు, ఇండోర్ సబ్-స్టేషన్ నిర్మాణ పనులను సిఎండి పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి. సురేంద్ర నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చిన్నరెడ్డెప్ప, పి. బాలాజీ, ఎన్. వాసవీలత, సోలార్ ఏజెన్సీల ప్రతినిధులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు
సీనియర్ సివిల్ కోర్టు...గూడూరు
E.P.No. 77/2016
in
O.S.No.204/2008

కామిరెడ్డి జ్యోతి అలియాస్ చింతంరెడ్డి జ్యోతి
... **Decree Holder**

Versus

1. కామిరెడ్డి మునిరామిరెడ్డి
2. కామిరెడ్డి రమణారెడ్డి

...**Judgement Debtors**

పై నెంబరు నందు ఈ దిగువ కనపరచిన వారిని అనగా

1. కామిరెడ్డి సుమతి తండ్రి లేట్ మునిరామిరెడ్డి
2. కామిరెడ్డి సునీత భర్త శ్రీధర్, **D/o.** లేట్ మునిరామిరెడ్డి

అను పై కనపరచిన ఇరువురుని 1వ Judgement Debtor చనిపోయిన కారణముగా అతని వారసులుగా మీ ఇరువురిని పై నెంబరు E.P.No. 77/2016 నందు 3,4Judgement Debtors గ చేర్చవలసినదిగా కోరుచూ డిక్రి హోల్డర్ E.A.No.784/2024 పిటిషన్ పెట్టినందున, మీకు ఈ నోటీసు ద్వారా తెలియపరుస్తు ఎలాంటి ఆక్షేపణలు వున్నయెడల తే.04.04.2025 దిన ఉదయం 10:00 గం॥లకు పై కోర్టులో హాజరై తెలుపు కోవలసినదనీ యావన్మందికి మీకున్ను తెలియ చేయడమైనది.

ఇట్లు
ఎ.రాజమాణిక్యం, B.Com., B.L.,
డిక్రిహోల్డర్ అడ్వకేట్.

IN THE COURT OF THE 1ST ADDL. JUNIOR CIVIL JUDGE: CHITTOOR
E.A.No.50 of 2023
O.E.P.No.130 of 2021
O.S. NO. 615 of 2019

Between: Smt P.Jhansi ...Decree Holder
And:
A.Sai Venkat and another
...Judgment-debtors

NOTICE TO JUDGMENT DEBTOR No.1

To
A.Sai Venkat, S/o A.Babu,
residing at 190 Ramapuram Village,
No.189 Kothapalle Post,Gudipala
Mandal, Chittoor District.

Sir, Please take notice that the above E.A filed against J.Drs No.1 & 2 and for delivery of possession property. The above matter stands posted to **29-04-2025** for your appearance and for objections if any. Please take notice and be present on the said date before the Hon'ble court by **10-30 A.M.**, to raise objections, if any, either in person or through your counsel. If failed to do so, the matter will be decided ex-parte in your absence.

Sd/-**SRI D.RAJENDRA REDDY,**
ADVOCATE-CHITTOOR.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, GUDUR
I.P No 34 / 2024

Nuvvuru.Narayana Reddy ...**Petitioner**
V.S
1.Penubolu.Narayana Reddy
2.Atla.Hari Krishna .... **Respondents**

GENERAL NOTICE

Whereas the petitioner filed the above I.P No 34/2024 against the respondents for declare the respondents No 1 as insolvent and consequently set-aside the sale deed dt 24-09-2024 vide Document No 12179/ 2024 of SRO Gudur executed by him in favour of the respondent No 2 in respect of the petition schedule property for realization of the amount due to the petitioner under the promissory note dt 4-10-2021 for Rs 4,00,000/- along with subsequent interest executed by respondent No 1 in favour of the petitioner. Therefore above said I.P is posted for 7-4-2025 for calling objection from general public. Therefore if anybody is having objections, you are hereby attended before the Hon'ble court on 7-4-2025 at 10-30 A.M before the above said Hon'ble court either personally or through pleader and file objections. If anybody will not come forward and file objection, the matter will be decided by presuming that there is no objections from general public.

S.Gangi Reddy, M.A,B.L
Advocate for the petitioner

రాయలసీమలోనే అగ్రగామి 'సీకాం'





ప్రజాశక్తి-తిరుపతి సిటి: కామర్స్ విద్యాబోధనలో రాయలసీమలోనే అగ్రగామి సీకాం విద్యాసంస్థలని ఆ సంస్థ డైరెక్టర్లు ప్రణీత్ స్వరూప్, టి.తేజ స్వరూప్ తెలిపారు. స్థానిక ఎయిర్‌బైపాస్ రోడ్డులోని న్యూమారుతి నగర్‌లోని సీకాం విద్యాసంస్థల ప్రాంగణంలో 'ప్రజాశక్తి'తో వారు మాట్లాడారు.

సీకాం పేరు వాస్తవానికి సంక్షిప్త రూపం, 'శ్రీనివాస ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కామర్స్. 44 సంవత్సరాల క్రితం ఇది ట్యుటోరియల్ ఇన్‌స్టిట్యూట్‌తో ప్రారంభమైంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తిరుపతి, కలికిరిలో మా రెండు శాఖలతో ప్రబలంగా ఉంది. వివిధ రకాల అకడమిక్ ప్రొఫెషనల్ కోర్సులను అందిస్తోంది. ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థులు తమ గ్రాడ్యుయేషన్, అండర్ గ్రాడ్యుయేషన్ డిగ్రీలను పొందుతున్నారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ టి. సురేంద్రనాథ రెడ్డి, సుప్రసిద్ధ విద్యావేత్త, చురుకైన సామాజిక సేవకుడు, క్రీడలను ఎప్పుడూ ప్రోత్సహించేవారు, అనుసరించేవారు, ఎప్పుడూ అలసిపోని పరోపకారి. తన పేరుకు వ్యతిరేకంగా వరుస డిగ్రీలను కలిగి ఉన్న డాక్టర్ రెడ్డి, వచ్చిన ప్రతి కోర్సులో ప్రావీణ్యం సంపాదించాడు, ఎల్లప్పుడూ కష్టపడి పనిచేసే వ్యక్తి, అతని పేరు విజయానికి పర్యాయపదంగా ఉంటుంది. డాక్టర్ రెడ్డి సీకాంను స్థాపించారు. విద్యార్థులు ఏ నేపథ్యం నుండి వచ్చినా అందరికీ అందుబాటులో విద్య ఉండేలా చేయడంలో ఒక ప్రత్యేకమైన, అంకితభావంతో కూడిన అంతర్దృష్టితో వ్యవహరిస్తారు. జూనియర్, డిగ్రీ, పిజి కోర్సులను అందరికి అందుబాటులో ఉంచాం. బికామ్ (కంప్యూటర్స్), బిసిఏ (డేటా సైన్స్), బిసిఏ (ఏ1), బిఎస్‌సి (ఆల్ గ్రూప్స్), బిబిఏ, ఎంకామ్ కోర్సుల్లో బోధన అందిస్తున్నాం. నాక్ అక్రిడేట్ కల్గిన విద్యాసంస్థ సీకాం. ఇప్పటి వరకు మా విద్యాసంస్థల్లో చదవిన సుమారు 30వేల మంది విద్యార్థులు వివిద రంగాల్లో ఉన్నత స్థానంలో ఉన్నారు. చదువుతో పాటు స్పోర్ట్స్ ఇతరత్రా రంగాల్లో సైతం నైపుణ్యం గడింప చేయడంలో మాదే పై చేయి అన్నారు. ప్రసిద్ధిగాంచిన పరిశోధనశాలలో శిక్షణ పొందే అనుమతి లభించింది. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయి. వివరాలకు 7799045454, 9494060614 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకతలు....

- సర్టిఫికెట్ కోర్సులు, బ్యాంకింగ్, ఫైనాన్స్ సౌకర్యాలు.
- ఏడాదికి ఒకసారి పరిశ్రమల సందర్శన.
- ఇంటర్‌షిప్ అవకాశం
- స్మార్ట్ క్లాస్ రూమ్స్. కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు.
- 100 శాతం ఉపాధి అవకాశాలు.
- ప్రతి తరగతికి కేవలం 40 మంది విద్యార్థులు మాత్రమే.
- బ్యాంక్ ఎగ్జామ్స్, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ శిక్షణ.
- బస్సు, హాస్టల్ సౌకర్యం.
- 0 శాతం లోన్ స్పెషాలిటీ.
- బెంగుళూరుకు చెందిన జైన్ యూనివర్శిటీ సందర్శనకు అనుమతి.
- కామర్స్ విద్యాబోధనలో విశేష అనుభవం.
- అనుభవజ్ఞులైన అధ్యాపకులు.

పాడి పరిశ్రమ, పౌల్ట్రీ రంగం అభివృద్ధికి చర్యలు: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా పాల ఉత్పత్తిలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉందని, ఈ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు బాధ్యతాయుతంగా వారి విధులను నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశం మందిరంలో పశుసంవర్ధక శాఖ అధికారులు, ఎన్ఇసిసి (నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ) సభ్యులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైతాంగం వ్యవసాయ రంగానికి అనుబంధంగా పాడి పరిశ్రమపై ఎక్కువ మంది రైతులు ఆధారపడి ఉన్నారని, అలాంటి పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడంలో భాగంగా పశువుల పెంపకంను ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. ఇందుకు క్షేత్రస్థాయిలో పశుసంవర్ధక శాఖ ద్వారా విధులను నిర్వర్తించే అసిస్టెంట్ డైరెక్టర్లు, వెటర్నరీ డాక్టర్ల వారి విధులతో పాటు పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవాలన్నారు. పాడి రైతులకు అవసరమైన రుణాల మంజూరుకు బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు మంజూరు చేయించేలా చర్యలు చేపట్టాలన్నారు. బ్యాంకర్లతో రుణాల మంజూరు విషయంలో ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకుని రావాలన్నారు. అలాంటి సమస్యల పరిష్కారానికి బ్యాంకర్ల సమన్వయ సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేయడం ద్వారా వ్యవసాయరంగంలో ఖరీఫ్, రబీ సీజన్‌లో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనే రైతులకు ఇది ప్రత్యామ్నాయంగా ఉంటుందన్నారు. పౌల్ట్రీ రంగాన్ని కూడా అభివృద్ధి చేసేందుకు తద్వారా ఉపాధి అవకాశాలు పెంపుకు చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పాడి పరిశ్రమ, పౌల్ట్రీ రంగం అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపడతామన్నారు. పశు సంవర్ధక శాఖ జెడి ఆరీఫ్, ఎన్ఇసిసి చిత్తూరు ఛైర్మన్ రమేష్ బాబు, బాలాజీ హేచరీస్ డైరెక్టర్ పునీత్, రామకృష్ణ, రాజమోహన్, సూర్యనారాయణ, పశుసంవర్ధక శాఖ ఏడీలు పాల్గొన్నారు.

స్నేహితులే 'కిడ్నాపర్లా'..!

ప్రజాదృష్టి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రాణమిచ్చేవాడు స్నేహితుడంటారు.. స్నేహంకు మించి లోకంలో ఏమీ లేదని చెప్పవచ్చు.. అగ్రహీరో ఎన్టీ రామారావు సినిమాలో 'స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం' అనే పాట స్నేహానికి అర్థం పడుతుంది. అయితే తాజాగా మానవీయ విలువలు తరిగిపోయి డబ్బే ప్రధానమైపోతోంది.. ఎంత ప్రాణ స్నేహితుడైనా పక్కన పెట్టి అతని దగ్గర ఉన్న డబ్బును ప్రాణం తీసైనా లాక్కోడానికి వెనుకాడటం లేదు. గత నెలలో తెల్లవారుజామున చిత్తూరులో డమ్మీ తుపాకులతో బెదిరించి రెండు గంటల పాటు భయోత్పాతం సృష్టించారు. తాజాగా శుక్రవారం రాత్రి తిరుపతి జీవకోనలో రాజేష్ కుటుంబంలోని ఐదుగురిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. రూ.2 కోట్లు ఇస్తే వదిలేస్తామని రాత్రంతా ఓ అపార్టుమెంట్‌లో ఉంచారు. రాజేష్‌తో పాటు తల్లి విజయ, భార్య సుమతి, పిల్లలు మోక్షిత, జాన్విత‌లను అదుపులో ఉంచుకున్నారు. చిత్తూరులో బంధువుల వద్ద డబ్బు ఇప్పిస్తామని చెప్పిన రాజేష్ డ్రైవర్ చేసి కారులో బయల్దేరారు. అయితే కారు వెళ తుండగానే తలుపు తీసి రాజేష్ కారులోనుంచి దూకేశాడు. దీంతో గాయపడిన రాజేష్‌ను స్థానికులు గుర్తించి తిరుపతి రుయాకు తరలించారు.

చిత్తూరు, తిరుపతిల్లో జరిగిన ఘటనలు స్నేహితుల పనే అని తెలుస్తోంది. చిత్తూరులో మార్చి 3న జిల్లాలో కలకలం రేపేలా ఘటన జరిగింది. ఐదుగురు దుండగులు డమ్మీ తుపాకులతో వచ్చి కోర్టు ఎదురుగా ఉన్న ఫర్నిచర్ షాపు ఓనర్ చంద్రశేఖర్‌రెడ్డిని డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరించారు. డమ్మీ తుపాకి అని తెలుసుకున్న చంద్రశేఖర్‌రెడ్డి తెలివిగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు సైతం వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. దొంగలు పారిపోయే ప్రయత్నం చేయగా నలుగురు దొరికిపోయారు. ఒకరు పరారయ్యాడు. ఈ కథ మొత్తం పరిశీలిస్తే చంద్రశేఖర్‌రెడ్డి నంద్యాలకు చెందిన శ్రీనివాసులు ఇద్దరూ దోస్తులు. వ్యాపారంలో శ్రీనివాసులు రాణించలేకపోయాడు. చంద్రశేఖర్‌రెడ్డి వ్యాపారం బాగుండడంతో శ్రీనివాసులు ఓర్వలేకపోయాడు. పథకం ప్రకారం కిరాయి గూండాలతో ఒప్పందం చేసుకుని ట్రయల్‌రన్ చేశాడు. విచారణలో దొరికిపోయాడు. ప్రస్తుతం శ్రీనివాసులు కటకటాలపాలయ్యాడు. తిరుపతి జీవకోన ఘటన కూడా అలాంటిదేనని తెలుస్తోంది. రాజేష్ చిన్ననాటి స్నేహితుడు భార్గవ్ కలిసిమెలిసి తిరిగారు. భార్గవ్ వ్యసనాలకు బానిసై అప్పులపాలయ్యాడు. అయితే ఓ స్థాయిలో ఉండి మీ సేవలో పనిచేస్తున్న రాజేష్‌ను 13 లక్షలు కావాలని కోరాడు. స్నేహితుడు కష్టాల్లో ఉన్నాడని అప్పుచేసి మరీ భార్గవ్‌కు డబ్బు ఇచ్చాడు. ఇచ్చిన డబ్బంతా వడ్డీలకే అయిపోయిందని, ష్యూరిటీ పెడితే రుణం తీసుకుంటానని మరో 30 లక్షలు తీసుకున్నాడు. అయితే తీసుకున్న రెండో రోజే భార్గవ్ పరారీలో ఉన్నాడు. ష్యూరిటీ సంతకం పెట్టిన రాజేష్‌పై బ్యాంకువారు ఇబ్బంది పెట్టారు. భార్గవ్ వల్ల ఇంత బాధ పడుతున్న రాజేష్‌నే రూ2 కోట్లు ఇవ్వాలని, చంపేస్తామని గుర్తు తెలియని వ్యక్తులుగా కిడ్నాప్ కథ నడిపినట్లు చర్చ నడుస్తోంది. భార్గవ్‌తో పాటు అతని స్నేహితుడు అరుణ్‌కుమార్ కూడా ఈ ఘటనలో ఉన్నట్లు సమాచారం. భార్గవ్ ఊళ్లో లేకపోవడం వల్ల అనుమానాలకు తావిస్తోంది.

నలుగురు వీఆర్‌ఓల సస్పెన్షన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారంలో భాగంగా పరిష్కారమైన అర్జీదారుల స్పందనను ఐవిఆర్ఎస్ ద్వారా సేకరిస్తోంది. సమాచార సేకరణలో భాగంగా ప్రజల నుండి ఫిర్యాదులు అందడంతో ఇందుకు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ క్షేత్రస్థాయిలో విచారణకు ఆదేశించారు. విచారణలో ఫిర్యాదులో కనపరచిన విషయాలు వాస్తవాలను తెలియడంతో నలుగురు విఆర్‌ఓలను సస్పెండ్ చేస్తూ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. బైరెడ్డిపల్లి మండలం లక్కనపల్లికి చెందిన విఆర్‌ఓ, ఎస్ఆర్ పురం నెలవాయికి చెందిన విఆర్‌ఓ, గంగవరం మండలం గండ్రాజుపల్లికి చెందిన విఆర్‌ఓ, నింద్ర మండలం అగరంకు చెందిన వీఆర్‌ఓలను కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నాటు సారాస్థావరాలపై డ్రోన్ కన్ను

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం నందు రోడ్డుకి అంతరాయం కలిగించినా లేక ట్రాఫిక్ ఉల్లంఘించిన వారికి డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలించి ఈ-చలానా, కేసులు పెట్టి కోర్టుకి తీసుకెళడం జరుగుతుందని, అదేవిధంగా నాటు సారా స్థావరాలు, బాలికలపై ఎవరైనా అసభ్యంగా నడుచుకొన్నా, పేకాట స్థావరాలను కూడా డ్రోన్ ద్వారా గుర్తించి వారిపై చట్టపరమైన చర్య తీసుకోవడం జరుగుతుందని డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ తెలిపారు.

ఐజర్‌లో అడ్మిషన్లకు మే 25న ఐఏటీ టెస్ట్

డైరెక్టర్ సంతాను భట్టాచార్య

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఐజర్‌లో చేరిన విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా పరిశోధనాత్మక సంస్థలకు సంబంధించి ఉపాధి అవకాశాలు పొందుతున్నారని ఐజర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంతాను భట్టాచార్య తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025–26 విద్యా సంవత్సరానికి గాను తిరుపతి ఐజర్ క్యాంపస్‌లో వివిధ కోర్సులకు సంబంధించి అడ్మిషన్ల కోసం ఆన్లైన్ దరఖాస్తులను కోరుతున్నామన్నారు. తిరుపతి ఐజర్ లో చేరాలనుకునే విద్యార్థులు ఇంటర్లో ఎంపీసీ, బైపిసి కోర్సు పూర్తయిన వారు ఏప్రిల్ 15వ తేదీ లోపు ఆన్లైన్ ద్వారా ఐజర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఐఏటీ) రాయడానికి తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మే 25న 60 ప్రశ్నలతో కూడిన ఆన్లైన్ ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఇందులో మెరిట్ లిస్టు ప్రకారం విద్యార్థుల ఎంపికను చేస్తామన్నారు. పరిశోధనలపై ఆసక్తి చూపే విద్యార్థులకు తిరుపతి ఐజర్ చక్కటి వేదికగా నిలిచి స్వాగతం పలుకుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ భానుశ్రీ, డాక్టర్ ఆనంద్, అడ్మినిస్ట్రేటివ్ పర్సన్ అజయ్ పాల్గొన్నారు.

తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

ప్రజాశక్తి -తిరుమల: తిరుమలలో రద్దీ కొద్దిగా తగ్గింది. గత కొద్ది రోజుల నుంచి పోల్చుకుంటే శనివారమయినా భక్తుల రద్దీ అంతగా లేదు. వరస సెలవులు వచ్చినా, ఉగాది కావడంతో పాటు తొలి పండగ కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తిరుమలకు రాలేదని చెబుతున్నారు. అందుకే తిరుమలలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగానే ఉంది. శుక్రవారం వరకూ అన్ని కంపార్ట్ మెంట్లలో భక్తులు నిండిపోయి క్యూ లైన్ బయట వరకూ విస్తరించి ఉండేది. కానీ శనివారం మాత్రం కొన్ని కంపార్ట్ మెంట్లు మాత్రమే భక్తులతో నిండిపోయి ఉన్నాయని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. శనివారం తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని తొమ్మిది కంపార్ట్ మెంట్లలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు.

కొవ్వొత్తులతో క్రైస్తవులు ర్యాలీ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: మార్చి 25న అనుమానాస్పద స్థితిలో మతి చెందిన పాస్టర్.ప్రవీణ్ పగడాల మతికి తిరుపతి యునైటెడ్ క్రిస్టియన్ చర్చస్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి తిరుపతి వెస్ట్ చర్చి వెలుపల అన్ని క్రైస్తవ సంఘాలు, పాస్టర్లు, నాయకులు, విశ్వాసులు పాల్గొని ఆయన కుటుంబ సభ్యుల కోసం, ఆయన పరిచర్య కోసం ప్రార్థన చేస్తు, కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్ అరుల్ అరసు మాట్లాడుతూ క్రైస్తవ సమాజం ఒక మహోన్నత వ్యక్తిని కోల్పోయిందని, ఆయన స్థానాన్ని ఎవరూ పూర్తిచేయలేరని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ క్యాండిల్ వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పగడాల ప్రవీణ్ మతికి కారణాలు వెంటనే ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. ఈ సంతాప కార్యక్రమంలో ఈస్ట్ పారిష్ పాస్టర్. బెంజిమెన్, వెస్ట్ చర్చి పాస్టర్.జాన్సన్, రిటైర్డ్ ఎస్ పి దేవదానం, పాస్టర్. లాజర్, ఉప సర్పంచి ఉమాపతి, దిలీప్ కుమార్, రాజేష్ అమర్ దేవ్, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి ఎన్టీఆర్ : నారా భువనేశ్వరి



ప్రజాశక్తి- కుప్పంటౌన్: ఎన్టీఆర్ పేదల పక్షపాతి అని ఆయన స్ఫూర్తితో పేదరికం లేని సమాజం కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని నారా భువనేశ్వరి అన్నారు. సామాజిక న్యాయం కోసం ఎన్టీఆర్ ఎనలేని కృషి చేశారని, ఆయన అడుగుజాడల్లో సీఎం పనిచేస్తున్నట్లు తెలిపారు. 4వ రోజు కుప్పం పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొని పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లు అర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహిళలతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ టిడిపి కార్యకర్తలే బలం అన్నారు. ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా పార్టీని అంటిపెట్టుకుని, బాబుకు తోడుగా నిలిచింది కార్యకర్తలే అని, కష్టాల్లో ఉన్నప్పుడు మాకు మనోధైర్యాన్ని ఇచ్చింది వారేనని, గత ఐదేళ్లలో ఎందరో కార్యకర్తలు పార్టీ కోసం తమ జీవితాలను త్యాగం చేయడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ స్థాపించి 28 సంవత్సరాలయ్యిందని, ట్రస్ట్ ద్వారా స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి ఇప్పటి వరకూ 7,531 మందికి శిక్షణ అందించినట్లు తెలిపారు. 2,500 మందికి ఉద్యోగాలు కూడా వచ్చాయన్నారు. ట్రస్ట్ ద్వారా సంజీవని ఆరోగ్య క్లీనిక్‌లు నడుపుతున్నామని అన్నారు. ఈ క్లీనిక్స్ వల్ల 1,60,290 మందికి ఉచితంగా వైద్యసేవలు అందించామని, ఇందుకోసం రూ.4,02,5000లు ఖర్చు చేసినట్టు తెలిపారు. ట్రస్ట్ ద్వారా 14,056 హెల్త్ క్యాంపులు నిర్వహించామని, వీటి ద్వారా 20 లక్షలమందికి ప్రయోజనం కలిగిందన్నారు. అలాగే ట్రస్ట్ ఆధ్వర్యంలో గండిపేటలో స్కూల్, మహిళ డిగ్రీ కాలేజ్ నిర్వహిస్తున్నామని, అందులో వచ్చిన ఆదాయంతో చల్లపల్లిలో పాఠశాల నిర్వహిస్తున్నామని, విపత్తుల సమయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఆపన్నులకు సేవలు అందించామన్నారు. ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా వారి స్వగ్రామాలకు చేర్చామని, కేరళలో వరదలు, హుద్ హుద్, తిత్లీ తుఫాన్, కర్నూలు వరదలు, విజయవాడ వరదల సమయంలో బాధితులకు ఎన్టీఆర్ ట్రస్ట్ అండగా నిలిచిందన్నారు. కుప్పంలో 150 మంది మహిళలకు టైలరింగ్, జ్యూట్ బ్యాగ్ తయారీ, సిల్క్ దారంతో గాజుల తయారీ, చికెన్ కారీ ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. త్వరలో బ్యూటీషియన్ కోర్సులు, మగ్గం వర్క్‌లో ట్రైనింగ్ అందిస్తామన్నారు. మహిళలు ఉపాధి పొందడమే కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదిగి పలువురికి ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు. అంతకుముందు కుప్పంలో సీఎం చంద్రబాబు తీసుకువచ్చిన షాహీ గార్మెంట్స్‌ను ఆమె సందర్శించారు.

ఉపాధి కోర్సులకు నిలయం 'వివికె'

నేడు కంప్యూటర్ శిక్షణ ప్రారంభం



ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఉపాధి కోర్సులకు నిలయంగా వేమన విజ్ఞాన కేంద్రం (వివికె) ఉంది. మూడు సంవత్సరాల నుంచి విజ్ఞాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోటీ ప్రపంచంలో ఏఐ టెక్నాలజీ దూసుకుపోతోంది. డ్రోన్లు ఎగురుతున్నాయి. వాటి వాడకం పెరిగింది. టెక్నాలజీలో వెనుకబడి పోకుండా ఉండేందుకు వేమన విజ్ఞాన కేంద్రంలో ఉపాధి కోర్సు కోసం కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తిరుపతి జిల్లాలో ఉండే యువతి ,యువకులకు, విద్యార్థిని ,విద్యార్థులకు ఉపాధి కల్పన కోసం వేమన విజ్ఞాన కేంద్రానికి వచ్చి తెలుసుకుంటే ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఆదివారం తిరుపతి యశోద నగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. కేవలం విద్యార్థిని, విద్యార్థులు, యువకులు కాకుండా మహిళలు కూడా కంప్యూటర్ కోర్సులు నేర్చుకునే అవకాశం ఇక్కడ కల్పిస్తున్నారు. కంప్యూటర్ కోర్సులు బయట నేర్చుకోవాలంటే వేలాది రూపాయలు ఫీజుల రూపంలో భారీగా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఆన్లైన్ కోర్సులు కూడా అంతే ఫీజులు ఉన్నాయి. అయితే వేమన విజ్ఞాన కేంద్రంలో చాలా తక్కువ ఫీజులతో కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ఇవ్వనున్నారు. తిరుపతి జిల్లాలో వేమన విజ్ఞాన కేంద్రంలో ఈ కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభానికి తిరుపతి ఐబిటి డైరెక్టర్ కే ఎస్ సత్యనారాయణ, ఐదవ అడిషనల్ జిల్లా జడ్జి, ఫ్యామిలీ కోర్టు బి రామగోపాల్ ప్రముఖులు రానున్నారు.

వేమన విజ్ఞాన కేంద్రం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. విద్యార్థులు, యువత, మహిళలు విభాగాల్లో ఎన్నో శిక్షణ కార్యక్రమాలు జరుపుతోంది. నిరుపేద విద్యార్థులకు ఉచిత ట్యూషన్ ఏర్పాటుచేసి శిక్షణ ఇప్పిస్తోంది. మహిళలకు టైలరింగ్లో శిక్షణ కార్యక్రమం జరుగుతోంది. యోగా, పద్యపోటీలు, పాటల పోటీలు, నాటక పోటీలు ఇలా అన్ని రంగాల్లో పోటీలు నిర్వహించి వారిలోని ప్రతిభా పాటవాలను వెలికితీయడంలో తనదైన ముద్రవేసుకుంది ప్రస్తుత ఆధునికయుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా మారింది. సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతున్న నేపథ్యంలో కంప్యూటర్ పరిజ్ఞానం లేకుంటే మనుగడ సాగని పరిస్థితి నెలకొంది. వేమన విజ్ఞానకేంద్రంలో ఆదివారం నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం కానుంది.

మొత్తం 26 కంప్యూటర్లను శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేశారు. వయస్సుతో నిమిత్తం లేకుండా ఆసక్తి ఉన్న వారందరికీ ఆహ్వానం పలుకుతోంది. ఈ కేంద్రంలో బేసిక్ కంప్యూటర్తో పాటు ఎంఎస్ వర్డ్, ఎక్సెల్, పవర్‌పాయింట్, ట్యాలీ, గ్రాఫిక్ డిజైనింగ్, ఇంటర్నెట్ వాడకం, డిజిటల్ భద్రత తదితర అంశాలపై శిక్షణ అందించనున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు బ్యాచ్ వారీగా శిక్షణ ఇవ్వనున్నారు. వివరాలకు పంచముఖేశ్వరరావును 99665 84759, 89850 80370 నంబరులో సంప్రదించాలని కోరారు.

నైపుణ్యంతోనే ఉపాధి

మల్లవరపు నాగార్జున వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి

నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకోవచ్చన్నారు. పోటీ ప్రపంచంలో నైపుణ్యం ఉంటేనే వారికి ఉపాధికి భరోసా లభిస్తుందన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ యుగంలో కొత్త కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పేద మధ్యతరగతి యువతీ యువకులు, మహిళలు విద్యార్థిని విద్యార్థుల కోసమే కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నాం. దీన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉంది. వేమన విజ్ఞాన కేంద్రం ఉపాధి కల్పన కేంద్రంగా మారనుంది.

ఆడిట్ సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రెవెన్యూ సదస్సులలో, పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలపై క్షేత్రస్థాయి ఆడిట్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో కలెక్టరేట్ పరిపాలన విభాగంలో పనిచేస్తున్న రెవెన్యూకు సంబంధించి వివిధ విభాగాలలో పనిచేస్తున్న తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సంబంధిత అధికారులతో సమావేశాన్ని జిల్లా కలెక్టర్, డిఆర్‌ఓ కె.మోహన్ కుమార్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరిగిన రెవెన్యూ సదస్సులలో, పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించడం ప్రధానమని తెలిపారు. మండలాల వారీగా కేటాయించిన అధికారులకు 15 రోజులు పాటు వారి పరిధిలో రెవెన్యూ సదస్సులు, పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలు పరిష్కారంకు తీసుకున్న చర్యలపై ఆడిట్‌ని పకడ్బందీగా నిర్వహించాలని, నివేదికను సమగ్రంగా సిద్ధం చేయాలన్నారు.

స్కానింగ్ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, పిసిపిఎన్ డిటి నోడల్ అధికారి డాక్టర్ హనుమంతరావు, వారి టీము శనివారం చిత్తూరు నగర పరిధిలోని మధు స్కాన్ సెంటర్‌ను తనిఖీ చేసి అన్ని రికార్డ్స్ పరిశీలించి పలు సూచనలు చేశారు. గర్భస్థలింగం నిర్ధారణ ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదని అలా చేస్తే రూ.10వేలు జరిమానా, జైలు శిక్ష, పరీక్షించిన డాక్టర్‌కు, సహకరించిన వారికి, గర్భవతికి విధింపబడునని తెలిపారు. కావున పిసిపి ఎన్‌డిటి చట్టాన్ని పగడ్బందీగా అమలు చేస్తేనే లింగ నిష్పత్తిని సమానం చేయవచ్చని తెలిపారు. డ్వామా జయరాముడు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

1వ తేదీ సాంఘీక శాస్త్రం పరీక్ష

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 31వ తేదీ రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ సెలవు కావడంతో పదో తరగతి సాంఘీకశాస్త్రం పరీక్ష ఏప్రిల్ ఒకటో తేదీ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అన్ని యాజమాన్య పాఠశాలల, కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణ సిబ్బంది ఏప్రిల్ ఒకటో తేదీ మాత్రమే సంబంధిత పోలీస్‌స్టేషన్స్ నుండి ప్రశ్నపత్రాలు తీసుకోవాలని కోరారు.

నేడు నాగయ్య కళాక్షేత్రంలో ఉగాది వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆదివారం నూతన తెలుగు సంవత్సరాది పురస్కరించుకొని చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఉగాది మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుందని, ఇందులో భాగంగా పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం, ప్రముఖ వ్యక్తులకు సత్కారం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడునని తెలిపారు. ఈ ఉగాది వేడుకలకు అందరూ ఆహ్వానితులేనని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

రేపు పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మార్చి 31 సోమవారం రంజాన్ పండుగ ప్రభుత్వ సెలవు దినం కావడంతో జిల్లా కేంద్రం, రెవెన్యూ డివిజన్ మండల కేంద్రాలలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కార నిమిత్తం దూర ప్రాంత ప్రజలు వ్యయప్రయాసలు ఓర్చి జిల్లా కేంద్రానికి, రెవెన్యూ డివిజన్, మండల కేంద్రంకు రావద్దని ఈవిషయాన్ని అర్జీదారులు గమనించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

30,31వ తేదీల్లో రిజిస్ట్రార్ కార్యాలయాలు

యథావిధిగా పనిచేస్తాయి: జిల్లా రిజిస్ట్రార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం, కమీషనర్ అండ్ ఇన్స్పెక్టర్ జనరల్, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ఆదేశాల ప్రకారం ఆదివారం 30, సోమవారం 31న రంజాన్ సెలవు దినములను పని దినాలుగా ప్రకటించడమైనదని జిల్లా రిజిస్ట్రార్ ఎ.రమణ మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరులోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ కార్యాలయం యథావిధిగా 11 నుంచి 5.30 గంటల వరకు పని చేయాలనీ ఆదేశాలు జారీచేయడమైనదని తెలిపారు. ప్రజలు ఈ విషయాలను గ్రహించి, రిజిస్ట్రేషన్ సేవలను వినియోగించు కోవలసిందిగా కోరారు. 2వ తేదీ నుంచి చిత్తూరు ఆర్‌ఓ, చిత్తూరు అర్బన్ ఎస్ఆర్‌ఓ (సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్లను స్లాట్ బుకింగ్ పద్ధతిలో చేయబడుతాయని జిల్లా రిజిస్ట్రార్ తెలిపారు.

ఈవిఎం గోదాము త్రైమాసిక తనిఖీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాకు సంబంధించి ఈవిఎంలను భద్రపరచిన గోదాము వద్ద నిరంతరం పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా చిత్తూరు కలెక్టరేట్‌లో ఉన్న ఈవిఎం గోడౌన్‌ను శనివారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్‌లో భద్రపరచిన ఈవిఎం యంత్రాలు, బియులు, సియులు, వివిప్యాట్‌లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ క్షుణంగా పరిశీలన చేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, టిడిపి వి.సురేంద్ర కుమార్, జనసేన దేవినేని యశ్వంత్, వైసిపి ఎస్.ఉదయ్ కుమార్, కాంగ్రెస్ పరదేశి, సిపిఎం గంగరాజు, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ వాసుదేవన్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది మనోజ్ కుమార్, ఉమాపతి పాల్గొన్నారు.



ఈవిఎం గోడౌన్ తనిఖీలో పాల్గొన్న కలెక్టర్, పార్టీల ప్రతినిధులు

జిల్లాలో ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో ఉపాధి అవకాశాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా సచివాలయంలోని జ్యోతిరావు పూలే భవన్ డీఆర్డీఏ సమావేశపు మందిరంలో ఈస్ట్ మన్ ప్రైవేట్ లిమిటెడ్ వారు వారి సంస్థలో పనిచేసేందుకు అవసరమైన సిబ్బంది కొరకు చిత్తూరు రూరల్, అర్బన్, గుడిపాల, బంగారుపాళ్యం మండలాల స్వయం సహాయక సంఘ మహిళలలో టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలతో ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి అవకాశాల కల్పనకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని తెలిపారు. చిత్తూరు జిల్లా కేంద్రంలో ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా ఈస్ట్ మన్ ఎక్సోర్ట్ గార్మెంట్స్ కంపెనీ వారు గార్మెంట్ స్థాపనకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈగవర్నమెంట్ స్థాపనకు అవసరమైన భూ కేటాయింపులను పరిశీలించడం జరుగుతుందని, గార్మెంట్స్ నిర్వహణకు సంబంధించి నైపుణ్యం కలిగిన టైలరింగ్‌లో శిక్షణ పొందిన అనుభవం ఉన్న మహిళలు అవసరమని తెలిపారు. స్థానికంగా ఉన్న ఉపాధి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన దిశగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈడీ బీసీ కార్పొరేషన్, డిఆర్‌డిఎ పీడీ శ్రీదేవి ఈస్ట్ మన్ ఎక్సోర్ట్ ప్రతినిధి మొహిద్దీన్, మెప్మా పీడీ రవీంద్ర, జిఎం డిఐసి సూరిబాబు, ఎపిఐఐసి జెడ్.ఎం.సుబ్బారావు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి గుణశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధి అధికారి పద్మజ, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, జిల్లా లేబర్ అధికారి ఓంకార్ పాల్గొన్నారు.

టిడిపి, వైసిపి మధ్య అగ్గి రాజేసిన సోషల్ మీడియా పోస్టింగ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

అధికార తెలుగుదేశం ఎమ్మెల్యేపై వైసిపి నాయకులు సోషల్ మీడియాలో వైరల్ అయిన పోస్టింగ్ అధికార ప్రతిపక్షాల మధ్య అగ్గి రాజేయడంతో వైసిపి, టిడిపి కార్యకర్తలు పరస్పరం దాడులకు దిగారు. శుక్రవారం రాత్రి 11 గంటలకు చోటు చేసుకున్న ఈ సంఘటనలో అధికార తెలుగుదేశానికి చెందిన సాయితేజ, వేణుగోపాల్ గాయాలపాలై చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తరుణంలో వైసిపి నేతలు అక్కడ కూడా దాడిచేసి గాయపరిచారని టిడిపి నాయకులు వైసిపి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్తూరు ఎమ్మెల్యేని చులకన చేస్తూ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టాడంటూ వైసిపి 51 డివిజన్ ఇంచార్జ్ మురళి రెడ్డిపై తెలుగుదేశం నేతలు దాడిచేసి గాయపరిచారని వైసిపి జిల్లా ఇన్చార్జి కరుణాకర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి విజయానంద రెడ్డి తెలుగుదేశం నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం చిత్తూరులో చోటుచేసుకున్న ఈ సంఘటనతో అధికార తెలుగుదేశం పార్టీ, వైసిపి నేతలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ పోలీసుల స్పందిస్తున్న తీరుపై ఇరుపార్టీలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాడుదామని యూనియన్ జిల్లా నూతన అధ్యక్షులుగా నాగార్జున రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.భారతి తెలిపారు. శనివారం రెండవరోజు ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సమావేశం బంగారుపాల్యం మార్కెట్ యార్డ్‌లో జరిగింది. ఈ సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. గౌరవాధ్యక్షులుగా వాడ గంగరాజు, యూనియన్ జిల్లా అధ్యక్షులుగా నాగార్జున రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.భారతి, కోశాధికారిగా హనుమంతు, ఉపాధ్యక్షులు నీలకంఠ రెడ్డి, మురళి, ఓబులేసు, జ్ఞానశేఖర్‌లను ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శులుగా చంద్రయ్య, రెడ్డమ్మ, రమేష్, నాగరాజులను ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ జిల్లాల్లో ఉన్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు దశలవారీగా పోరాటం చేస్తామని అందరూ ఐక్యంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం చిత్తూరు జిల్లా కార్యదర్శి శంకరన్ సంఘీభావం తెలిపారు.

ఎంపీపీ, వైస్ ఎంపీపీలకు సన్మానం

ప్రజాశక్తి - రామకుప్పం: మండల నూతన ఎంపీపీ సులోచన గుర్రప్ప, 2వ వైస్ ఎంపీపీ వెంకట్రామ గౌడును టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు టిడిపి నేతలతో కలిసి ఘనంగా సన్మానించారు. శనివారం వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి, ఆంజనేయ రెడ్డి, రామ్మూర్తి, శ్రీనివాసులు రెడ్డి, చంద్రారెడ్డి, జయశంకర్, విశ్వనాథ్, వెంకటాచలం, కృష్ణారెడ్డి, బాలు, మంజు, సత్తి, నాగరాజు పాల్గొన్నారు.

కందూరులో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి- సోమల: మండలం మేనేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని 200 మంది ముస్లిం సోదరులకు రంజాన్ పురస్కరించుకొని టిడిపి నాయకులు ఇఫ్తార్ విందును అందజేశారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, మైనార్టీ నాయకులు అష్రఫ్ అలీ, బాలకృష్ణ నాయుడు సతీష్ హరి ప్రసాద్ నాయుడు ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: తహశీల్దార్ కార్యాలయంలో శనివారం చలివేంద్రాన్ని తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. డిటి కల్యాణి, జూనియర్ అసిస్టెంట్ లావణ్య, విఆర్ఓలు సురేంద్ర, వెంకటరత్నం, మోహన్ శివ, రూపేష్ పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడకలు

ప్రజాశక్తి -యంత్రాంగం: గంగాధర నెల్లూరు మండలంలో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా మండలంలోని తూగుండ్రం, గంగాధర నెల్లూరులో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ టిడిపి జెండాను ఎగురవేసి, ఎన్టీ రామారావు చిత్రపటానికి నివాళు లర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పేద మహిళలకు ఎమ్మెల్యే చీరలు పంపిణీ చేశారు. ఎస్ఆర్ పురం మండలంలో మండలాధ్యక్షులు జయశంకర్ నాయుడు, మార్కెటింగ్ యార్డు ఛైర్మన్ జయంతి ఆధ్వర్యంలో టిడిపి జెండా ఎగురవేసి మిఠాయిలు పంచిపెట్టారు. రామకుప్పంలో టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా జరిపారు. శనివారం పార్టీ కార్యాలయం వద్ద దివంగత నేత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.




పలమనేరులో ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి



జిడి నెల్లూరులో ఎమ్మెల్యే థామస్

బంగారుపాళ్యంలో టిడిపి మండల అధ్యక్షుడు జయప్రకాశ్ నాయుడు, మాజీ ఎఎంసీ చైర్మన్ జయచంద్ర నాయుడు, సింగల్ విండో మాజీ చైర్మన్ హేమచంద్ర నాయుడు ఆధ్వర్యంలో టిడిపి జెండా ఎగరవేసి కేకులు కట్ చేసి పంచుకున్నారు. సోమల బస్టాండ్ కూడలిలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు భారీ కేక్‌కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తవణంపల్లి మండలం అరగొండలోటిడిపి ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ జెండా ఆవిష్కరించి, ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళు అర్పించారు. పలమనేరులో నియోజకవర్గ కేంద్రంలోని మార్కెట్ యార్డ్ వద్ద నిర్వహించిన వేడుకల్లో స్థానిక శాసన సభ్యులు అమరనాథ రెడ్డి పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు నిర్వహించి నివాళులు అర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించడంతో పాటు కేక్ కట్ చేసి పలువురికి పంచి పెట్టారు. అన్నదానం చేశారు. రొంపిచెర్ల మండలంలోతెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను పుంగనూరు ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. వెదురుకుప్పంలోబోడిరెడ్డి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. బైరెడ్డిపల్లి చెక్‌పోస్టు కూడలిలో మండల అధ్యక్షులు బిఎం.రాధా కిషోర్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గంగవరంలో టిడిపి పార్టీ కార్యాలయం ఆవరణలో అన్నదానంచేశారు. కార్వేటినగరంలో గాంధ్ర మిట్ట కూడలి వద్ద నందమూరి తారక రామారావు చిత్రపటానికి మండల అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి పార్టీ జెండాను ఎగర వేశారు. కుప్పం మండల చెక్కునత్తం పంచాయతీ పరిధిలోని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మణి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



తవణంపల్లిలో ఎమ్మెల్యే మురళీ మోహన్

'వందేభారత్' రైలును గూడూరులో ఆపాలి


వినతిపత్రం అందిస్తున్న శ్యామ్ యాదవ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వందే భారత్ రైలును గూడూరులో ఆపాలని మాజీ డిఆర్‌యు సిసి మెంబర్ మయూరి శ్యామ్ యాదవ్ కోరారు. డిఆర్‌డిఓ మాజీ ఛైర్మన్, భారత రక్షణ శాఖ సలహాదారు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్ రెడ్డిని శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షులు, సౌత్ సెంట్రల్ రైల్వే మాజీ డిఆర్‌యుసిసి మెంబర్ మయూరి శ్యామ్ యాదవ్ శనివా రం కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ నుండి గూడూరు మీదుగా తిరుపతికి వెళ్లే వందేభారత్ రైలు గూడూరులో ఆపేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సతీష్ రెడ్డిని కోరా మన్నారు. గూడూరు రైల్వే జంక్షన్ కావడంతో ప్రయాణి కులు అధికంగా వుంటారని వారికి సౌకర్యవంతంగా ఆపాలని కోరారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని శ్రీకాళహస్తి –తడ రోడ్డు మార్గం బుచ్చినాయుడు కండ్రిగ మెయిన్ రోడ్డులో పోలీసులు శనివారం వాహనాలు తనిఖీ చేశారు. రోడ్డుకి అడ్డదిడ్డంగా వున్న వాహనాలు గుర్తించి వారికి అవగాహన కల్పించారు. రోడ్డుకు వాహనదారులకు ఇబ్బందికరంగా వున్న గుంతలను జెసిబి సాయంతో పూడ్చారు. దుకాణాల ఎదురుగా వున్న టూ వీలర్స్ పార్కింగ్‌ను సరిచేశారు. ఆటో డ్రైవర్లు లైసెన్స్ లేకుంటే సిఐతో మాట్లాడి లైసెన్సులు ఇప్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రభాకర్, డ్రాగన్ రమేష్ , రంగా పాల్గొన్నారు.

రాయితీ వ్యవసాయ యంత్రాలు పంపిణీ

ప్రజాశక్తి- రామచంద్రపురం: వ్యవసాయ యాంత్రికరణ పథకం ద్వారా రైతులకు సబ్సిడీ వ్యవసాయ యంత్రాలను మండల ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వివిధ పరికరాలు 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తోందన్నారు. పాడి పశువుల సంరక్షణ కోసం పాడి రైతులకు గోకులం షెడ్లు, దాహార్తి తీర్చేందుకు తాగునీటి తొట్టెల నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్ రావు, వ్యవసాయ శాఖ అధికారిణి స్రవంతి, ఎంపీడీవో ఇందిరమ్మ, తహశీల్దారు కే వెంకటరమణ, చంద్రగిరి నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షుడు పూజారి సుబ్రహ్మణ్యం యాదవ్, ఎం తిరుమలరెడ్డి, ముద్దు కృష్ణారెడ్డి, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


గోపాలరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నాని

ఏర్పేడు గోపాల్ రెడ్డికి పరామర్శ

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని నడవలూరు గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు, ఏర్పేడు గోపాల్ రెడ్డిని ఎమ్మెల్యే పులి వర్తి నాని శనివారం పరా మర్శించారు. తెలుగు యువత కార్యదర్శి ఏర్పేడు వేదాంత రెడ్డి తండ్రి ఏర్పేడు గోపాల్ రెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో మంచానికి పరిమితమయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని స్వయంగా గోపాల్ రెడ్డి ఇంటికి వెళ్లి గోపాల్ రెడ్డి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సంరక్షణ కోసం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం తిరుమలరెడ్డి, ఎం చిన్నబాబు, వసంత్ కుమార్ నాయుడు, కోటేశ్వర్ రెడ్డి, టీ కేశవుల నాయుడు.కే ముని కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, అర్జున్, మాజీ సర్పంచ్ ఎన్ రామచంద్రారెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, ఏర్పేడు వేదాంత రెడ్డి పాల్గొన్నారు.

చంద్రయ్య సేవలు అభినందనీయం: ఎంఈవో

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తాను నమ్మిన ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో విద్యార్థులను క్రమశిక్షణలో ఎదగాలని ఉపాధ్యాయులు చంద్రయ్య సేవలు అభినందనీయమని ఎంఈవో తిరుమల రాజు తెలిపారు. రూరల్ మండలం వేపగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో పనిచేస్తూ, పిఎస్ హెచ్ఎం. శనివారం చంద్రయ్య ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఛైర్మన్ గోవిందరాజులు, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సంధ్య, వాసు, మోహన్ మణికంఠ పాల్గొన్నారు. వేపగుంట హైస్కూల్ ఉపాధ్యాయులు సూర్యానారాయణ, మోసెస్ వివిధ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్మశానానికి దారి కల్పించండి: సిపిఎం



సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాల్టీ ఒకటో వార్డు చెందిన కట్ట కింద రామకృష్ణాపురం శ్మశానానికి దారి కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో పుత్తూరు తహశీల్దారు కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పుత్తూరు కార్యదర్శి ఆర్ వెంకటేష్, దళిత, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై నందయ్య మాట్లాడుతూ సుమారు 35 మంది రైతులు వ్యవసాయ భూముల్లో రోడ్డు వేయడానికి అంగీకరించి రోడ్డు ఫార్మేషన్ అయిందని, అరవై అడుగుల ఇవ్వాలని రైతు గోవింద్ రెడ్డిని గ్రామస్తులు కోరినా ఆయన నిరాకరిం చడంతో శ్మశానికి దారి లేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో 135 కుటుం బాల వారు శ్మశానానికి దారి లేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోవింద్ రెడ్డితో మాట్లాడి శ్మశానానికి దారి కల్పించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. అనంతరం పుత్తూరు తహశీల్దారుకు వినతిపత్రం అందించారు. స్పందించిన తహశీల్దారు మాట్లాడుతూ వెంటనే ఆయనతో చర్చించి శ్మశానానికి దారి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మురుగేశ్ రెడ్డి, ఏలుమలరెడ్డి, చిరంజీవి, రవి, వేల్ రెడ్డి, కృష్ణారెడ్డి, కాల్ అమ్మ, లక్ష్మి, శకుంతల, రంగమ్మ, విజయమ్మ విజయమ్మ, దేవానమ్మ పాల్గొన్నారు.

స్కిమ్స్‌లో ముందస్తు ఉగాది వేడుకలు


స్కిమ్స్‌లో ముందస్తు ఉగాది వేడుకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తికి సమీపంలోని శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ కళాశాలలో శనివారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్ మిద్దెల హరి ఉగాది ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. శ్రీవిశ్వావసు నామ తెలుగు సంవత్సరంలో అందరూ సుఖ శాంతులతో వర్ధి ల్లా లని ఆకాంక్షిం చారు. డైరెక్టర్ శ్రీకుమార్, ఎంసీఏ– హెచ్ ఓ డి సునీల్ కుమార్, ఏవో సౌందర్య రాజ, అధ్యాపకులు ఈశ్వరయ్య, ఎ రోజా , ఎ సాయి కుమారి, ల్యాబ్ అసిస్టెంట్ వై కిరణ్మయి పాల్గొన్నారు.

నేడు ఉగాది కవి సమ్మేళనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఉగాదిని పురస్కరించుకుని పట్టణం లోని బాలికల ఉన్నత పాఠశాలలో ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు వేదిక ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లగడపాటి భాస్కర్ సాహితీ పురస్కారాలు ఈ ఏడాది సాహితీ వేత్తలు గొడు గుచింత గోవిందయ్య కు, డాక్టర్ నారాయణ స్వామి లకు ప్రదానం చేయను న్నట్లు ప్రదాతలు లగడపా టి కిరణ్మయి, కృష్ణశశిలు తెలిపారు. కవులు, రచయితలు, సాహితీ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

శ్రీ లక్ష్మీ జ్యువెలర్స్‌లో తక్కువ ధరకు ఆభరణాలు

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు లోని పల్లి వీధిలో మసీదు ఎదురుగా ఉన్న శ్రీ లక్ష్మీ జ్యువెలర్స్‌లో ఉగాది సందర్భంగా బంగారం 22 క్యారెట్లు, వెండి ఆభరణాలపై తరుగు కూలి లేకుండా ఇవ్వనున్నట్లు, 916 కేడియం బంగారం ఆభరణాలపై అతి తక్కువ తరుగు కూలీలతో ఇవ్వనున్నట్లు దుకాణ యజమాని తెలిపారు. కష్టమర్లు కోరిన డిజైన్ ఆభరణాలను అతి తక్కువ సమయంలో తక్కువ ధరలకు ఇవ్వనున్నట్లు ప్రొప్రైటర్ పవన్ కుమార్ తెలిపారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి: తహశీల్దారు

ప్రజాశక్తి -కోట : బాల్య వివాహాలను నిర్మూలించాలని కోట తహశీల్దారు కటారి జయ జయ రావు అన్నారు. శనివారం కోట మండలం చిట్టేడు గ్రామం గిరిజన కాలనీ లో సివిల్ రైట్స్ డేను తహశీల్దారు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మధులత, కోట ఎస్సీ బాలికల హాస్టల్ వార్డెన్ టి ఉషారాణి, అంగన్‌వాడీ సూపరువైజర్ కవిత, టిడిపి సీనియర్ నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తిరుపతి బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా గజేంద్ర



ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి బార్ అసో సియేషన్ అధ్యక్షులుగా గజేంద్ర గెలు పొందా రు. శుక్రవారం నిర్వ హించిన బార్ అసోసి యే షన్ ఎన్నికలలో వెంకటముని పై గజేంద్ర గెలుపొందారు. ప్రధాని కార్యదర్శిగా విశ్వనాథరెడ్డి, ఉపాధ్యక్షులుగా మునయ్య, లేడీ రిప్రజెంటేటివ్‌గా కోమలాదేవి, కల్చరల్ అండ్ స్పోర్ట్స్ కార్యదర్శిగా నాగరాజు, జాయింట్ సెక్రెటరీగా చంద్ర మోహన్, కోశాధికారిగా సునీల్ కుమార్ గెలుపొందారు. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: మండలంలో సత్యవేడు నియోజకవర్గ మైనార్టీ కన్వీనర్ మహమ్మద్ నవాబ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ నాయకులు సల్లావుద్దీన్ మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో రంజాన్ పండుగ పురస్కరించుకొని రంజాన్ తోఫాను గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షు లు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు బండి ధనుంజయ రెడ్డి, ట్రెజరీ కాటూరి శ్రీనివాసులు, ప్రగతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కోట : కోట పట్టణంలోని 'ఎస్కేబీ (గ్రూప్)' ప్రాంగణంలో శనివారం గ్రీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో షేక్.జలీల్ అహ్మద్ నేతృత్వంలో పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా(పండుగ సామాగ్రి)ను ఎమ్మెల్యే సునీల్ కుమార్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో జలీల్ అహ్మద్, టీడీపీ సీనియర్ నాయకులు పలగాటి భాస్కర్ రెడ్డి,నెల్లూరు మోహన్ రెడ్డి,తిరుపతి జిల్లా బీసీ సెల్ కార్యదర్శి తీగల సురేష్ బాబు,కోట బిట్ ఎంపీటీసీలు షేక్ పాల్గొన్నారు.

ఉగాది పురస్కారానికి రాసాని ఎంపిక

ప్రజాశక్తి - క్యాంపస్ : ఉగాది పురస్కారమైన ప్రతిభా పురస్కారానికి ఈ ఏడాది ప్రముఖ కథా, నవల, నాటకం రచయిత, కవి, విమర్శకుడు, కాలమిస్టు, నటుడు, నాటక ప్రయోక్త, మంచి ఉపన్యాసకుడు, బహుముఖ ప్రజ్ఞావంతుడు, లబ్ధప్రతిష్ఠుడైన డాక్టర్ వి.ఆర్ రాసాని ఎన్నికయ్యారు. ఈ ప్రతిభా పురస్కారం రావడంతో పలువురు ఆయనకు శు భాకాంక్షలు తెలిపారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: భాకరాపేటలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి బెల్లంకొండ మురళి, సీనియర్ నాయకులు హెచ్ లోకనాథం చిన్నగొట్టిగల్లులో టిడిపి మండల ఇన్‌ఛార్జి కొట్టె శివకుమార్ ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిట్టెమ్మ, దాము, టిడిపి వెంకీ, గొల్లపల్లి చెంగల్రాయులు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : గూడూరు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ , నాయకులు ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్ కుమార్ , మట్టం శ్రావణి, బిల్లు చెంచురామయ్య , పులిమి శ్రీనివాసులు, శివకుమార్, రహీం , లీలావతి, భారతి పాల్గొన్నారు.

ఓజిలి : టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు విజయ కుమార్ నాయుడు , గున్నం రెడ్డి మధుసూదన్ రెడ్డి , పాడి వెంకట సుబ్బయ్య , కంకణాల ప్రసాద్ నాయుడు, కొండూరు సుబ్రహ్మణ్యం రాజు , శ్రీనివాస్ రెడ్డి ,ఖలీల్ ,ప్రకాష్ నాయుడు ,బచ్చల రవీంద్ర రెడ్డి, దాసరి నిరంజన్ , డాక్టర్ అంకయ్య ,నన్నూరు శ్రీనివాసరావు, గురుమూర్తి , కోటి పాల్గొన్నారు.


పుత్తూరులో

పుత్తూరు టౌన్ : రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పట్టణంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్ చి త్ర ప టా ని కి పూలమాలవేసి నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో. టిడిపి చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగం రెడ్డి, చెంచయ్య, సర్పంచ్ బొబ్బిలి వెంకటేష్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండల టిడిపి అధ్యక్షులు ఎం సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చలివేంద్రం ద్వారా మజ్జిగ వితరణ, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వరదయ్యపాలెం: మండల టిడిపి అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచి పెట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. నియోజకవర్గ పరిధిలోని పలువురికి సిఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. విజయ్ కుమార్ నాయుడు, చెంచయ్య నాయుడు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : చెన్నూరులో తిరుపతి పార్లమెంట్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. సీనియర్ నాయకులు పడాల.రత్నయ్య, నీటి సంఘం నాయకులు యారమాపు హేమ కుమార్ రెడ్డి , గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం : టిడిపి మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు గోను జకరయ్య మైనార్టీ నియోజకవర్గ అధ్యక్షులు షబ్బీర్ ఏకొల్లు మాజీ సర్పంచి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: మండలంలోని నడవలూరులో సాయి ప్రసాద్ రెడ్డి, కిషోర్ రెడ్డి, వేదాంత్ రెడ్డి ఆధ్వర్యంలో, ఎన్ఆర్ కమ్మపల్లి లో టిడిపి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు. అనంతరం నడవలూరు గ్రామంలో నూతన ఆర్ఓ ప్లాంట్ ను ప్రారంభించారు. కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి, జనార్ధన్ చౌదరి, ఎన్ చిన్నబాబు, టి కేశవులు నాయుడు, కే నరసింహారెడ్డి, కమలాకర్ రెడ్డి, చైతన్య, నాగరాజు, చైతు, రమేష్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోట: కోట మండలంలోని తిరుపతి పార్లమెంట్ మైనారిటీ అధ్యక్షులు షేక్.జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు వాకా విజయభాస్కర్ రెడ్డి, బందిల రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.


రామచంద్రాపురంలో


రామచంద్రాపురం(చంద్రగిరి): మండలంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. మండల టిడిపి అధ్యక్షుడు పల్లి నేని సుబ్రహ్మణ్యం నాయుడు, చిత్తూరు పార్లమెంటు ఉపాధ్యక్షు లు గౌస్ బాషా, సీనియర్ నాయకులు వీరంగారి రమేష్ రెడ్డి, ఈశ్వరవాక శివ కోటేశ్వర రెడ్డి, ముడి పల్లి సురేష్ రెడ్డి, ఎజి పల్లి బాల, నాగరాజ నాయుడు, ప్రభాకర్ నాయుడు, ప్రవీణ్ రాయల్, సక్కూరి ధనంజయ రెడ్డి, వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

కోట: కోటలో నిర్వహించిన వేడుకల్లో టిడిపి సీనియర్ నాయకులు పూర్ణచంద్రరావు , కార్యక్రమంలో పార్టీ అభిమానులు కురవ కృష్ణన్న, సాయిచరణ్, చాణిక్య, భాస్కర్ రావు, పున్నారావు, కాట్రగడ్డ బోసు, తలశిల ప్రసాద్, రాజేంద్రప్రసాద్, నరసింహులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం(చంద్రగిరి): మండలంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. మండల టిడిపి అధ్యక్షుడు పల్లి నేని సుబ్రహ్మణ్యం నాయుడు, చిత్తూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు గౌస్ బాషా, సీనియర్ నాయకులు వీరంగారి రమేష్ రెడ్డి, ఈశ్వరవాక శివ కోటేశ్వర రెడ్డి, ముడి పల్లి సురేష్ రెడ్డి, ఎజి పల్లి బాల, నాగరాజ నాయుడు, ప్రభాకర్ నాయుడు, ప్రవీణ్ రాయల్, సక్కూరి ధనంజయ రెడ్డి, వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

'అందమైన' ప్రపంచం 'అమిగోస్'

- సామాన్యులకు అందుబాటులో అపార్టుమెంట్
- బిల్డర్స్ అధినేత అనిత్‌రెడ్డి వెల్లడి



ప్రజాశక్తి-తిరుపతి సిటి: గృహమే స్వర్గసీమ అన్నాడో మహాకవి. దానికి చిరునామాగా నిలుస్తోంది అమిగోస్. సామాన్య, మధ్యతరగతి ప్రజలు సొంతింటి కలను నెరవేర్చేందుకు అన్ని రకాల సదుపాయాలతో, సరసమైన ధరలతో సొంతింటిని సాకారం చేసుకునేందుకు అమిగోస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ నిత్యం కృషి చేస్తుందని ఆ సంస్థ అధినేత అనిత్‌రెడ్డి తెలిపారు. తిరుపతి-కరకంబాడీ రోడ్డు తిమ్మినాయుడుపాళెం కూరపాటి లేఅవుట్ సమీపంలో, తిరుపతి రూరల్ అవిలాల గ్రామ సచివాలయం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అపార్టుమెంట్ వద్ద ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

ప్రజల ప్రతి ఆసక్తి, ప్రాధాన్యతను అందించడం, విశ్రాంతి కార్యకలాపాల హద్దులేని రాజ్యాన్ని ప్రదర్శించడం అవసరం. మా అపార్టుమెంట్‌లో ఈ సౌకర్యాలు మెండుగా ఉన్నాయి. క్రీడా సౌకర్యాలతో చురుకైన జీవనశైలిని ఆలింగనం చేసుకోండి. ఆరుబయట వినోదం కోసం విశాలమైన పచ్చిక బయళ్ళు, చైతన్యం నింపే స్ట్రోల్స్‌ను ఆహ్వానించే సుందరమైన వాకింగ్ ట్రాక్‌లు, ఇండోర్ ఎంటర్‌టైన్‌మెంట్ కోసం, టేబుల్ టెన్నిస్ నుండి బిలియర్డ్స్ వరకు వివిధ రకాల ఆటలలో మునిగి తేలడం, విశ్రాంతి ఆనందానికి అంతులేని అవకాశాలను అందించేలా కృషి చేస్తున్నాం. ఆకర్షణీయమైన సిమ్మింగ్‌పూల్, ప్లేగ్రౌండ్, మల్టీపర్పస్ పార్టీ హాల్. విశ్వాసం, అచంచలమైన నిబద్ధత. లోతైన డొమైన్ నైపుణ్యం, మీ జీవితానికి బలమైన పునాదిని నిర్మించడం, తిరుపతి రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో విజనరీ అప్రోచ్ వారి నైపుణ్యం, ఉత్సాహం రెండింటినీ ప్రతిబింబించేలా తీర్చిదిద్దుతున్నాం. ప్రాపర్టీస్ నమ్మకం, కస్టమర్ సంతప్తి ఆధారంగా ఆశించదగిన ఖ్యాతిని పొందాయి. నమ్మశక్యం కాని నివాస స్థలాల నుండి కమర్షియల్ కాంప్లెక్స్‌ల వరకు, అసాధారణమైన నాణ్యతను అందించడానికి మా అంకితభావం అనేక మంది వినియోగదారుల విశ్వాసాన్ని పొందింది. ఇదే వినియోగదారుల సంఖ్యను పెంచుతోంది. హోలిసిటీ, రిలాక్స్, సంతోషించు, విశ్రాంతి పొందండి, ప్రశాంతత, విశ్రాంతి సారాంశాన్ని వినియోగదారులు అనుభవించాలి. అద్భుతమైన ల్యాండ్‌స్కేపింగ్‌తో సజావుగా మిళితమై ఉన్న నిష్కళంకమైన ఆర్కిటెక్చర్ అద్భుతమైన ఫ్రంట్ వ్యూతో మంత్రముగ్ధులయ్యేలా సిద్ధం చేసుకోండి. గ్రాండ్ ఎంట్రన్స్ నుండి కళ్లకు విజువల్ ఫీస్ట్‌ను రూపొందించడం ద్వారా నిశితంగా రూపొందించబడిన ముఖభాగం వరకు, ప్రతి వివరాలు ఆనందాన్ని కలిగించడానికి, స్ఫూర్తినిచ్చేలా రూపొందించబడ్డాయి. సొంతింటి అభిరుచిగల ప్రతి ఒక్కరి అంచనాలకు తగ్గట్టుగా అపార్టుమెంట్లు నిర్మిస్తున్నాం. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. వివరాలకు 9603222822, 9603222722 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఒక రకంగా అమిగోస్ అందమైన ప్రపంచమనే చెప్పాలి.



ప్రత్యేకతలు...

- 24/7 సెక్యూరిటీ
- గేటెడ్ కమ్యూనిటీ
- లగ్జరీ క్లబ్ హౌస్
- అవుట్ డోర్ అమెనిటీస్
- ఇండోర్ అమెనిటీస్
- లగ్జరీ స్విమ్మింగ్ పూల్
- సోలార్ పవర్‌తో ఫెన్సింగ్
- చిన్నపిల్లలకు ప్రత్యేకంగా క్రీడా ప్రాంతం.
- వాకింగ్ ట్రాక్
- ఆకర్షణీయమైన మొక్కలతో బృందావనం.

ప్రాజెక్ట్ లక్షణాలు

- 100శాతం వాస్తు
- సురక్షిత గేటెడ్ కమ్యూనిటీ
- భూగర్భ విద్యుత్తు
- పవర్ బ్యాకప్ ప్రొవిజన్
- ఎలక్ట్రిసిటీ పోల్స్ డిజైనర్
- సిసి కెమెరా సర్వైలెన్స్ సిస్టమ్
- అధునాతన భద్రతా వ్యవస్థ
- ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ పాయింట్లు
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సోలార్ సెక్యూరిటీ సిస్టమ్
- రెయిన్వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్
- పచ్చదనంతో అవెన్యూ ప్లాంటేషన్
- శుద్ధి చేసిన నీటి సరఫరా
- ప్రెజర్ పంపులు
- 24 గంటలు అంతరాయం లేని నీటి సరఫరా